క్లుప్తంగా

జోరుగా కంది, ఉలవ సాగు


బ్రాహ్మణపల్లి వద్ద కంది విత్తుతున్న రైతులు

కూడేరు: గత 10 రోజులుగా మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగులో నిమగ్నమయ్యారు. భగవంతుడా .. ఇక నీదే భారమంటూ సోమవారం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి, గొటుకూరు, కమ్మూరు, ఉదిరిపికొండ, కరుట్లపల్లి, చోళసముద్రంతో పాటు మరికొన్ని గ్రామాల్లో పలువురు రైతులు ఉలవ, కంది సాగుకు శ్రీకారం చుట్టారు. ఖరీఫ్‌లో వేరుశనగ సాగు సాధారణ విస్తీర్ణం సుమారు 35 వేల ఎకరాలు ఉండగా.. వర్షాభావం వల్ల సమారు 2 వేల ఎకరాల్లో మాత్రమే రైతులు వేరుశనగ సాగు చేశారు. చాలమంది రైతులు ప్రభుత్వం సబ్సిడీతో అందించే ప్రత్యామ్నాయ విత్తనాలు కోసం ఎదురు చూస్తున్నారు. అయితే కొందరు రైతులు ప్రైవేట్‌గా కంది, ఉలవలు తెచ్చుకుని విత్తుకుంటున్నారు.

ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సభ్యులు

రాయదుర్గంటౌన్: నియోజకవర్గం ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సెయింట్‌పాల్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో నియోజకవర్గంలోని ప్రైవేటు స్కూల్స్ కరస్పాండెంట్లు హాజరై సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కమిటీ గౌరవాధ్యక్షురాలిగా కవిత (స్టోన్ వ్యాలీ స్కూల్), అధ్యక్షుడిగా ఎం.వన్నూరుస్వామి (బాల మేధావి స్కూల్, కల్యం), జనరల్ సెక్రటరీగా కెకెహెచ్ అతావుల్లా (అతావుల్లా ఇంగ్లిష్ మీడియం స్కూల్, కణేకల్లు), కోశాధికారిగా సుగుణ జ్యోతి (సెయింట్ పాల్స్ స్కూల్)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు నూతనంగా జిల్లా కార్యవర్గంలో ఉపాధ్యక్షురాలిగా ఎం.రుక్మిణి (వాణి ఇంగ్లిష్ మీడియం స్కూల్), సంయుక్త కార్యదర్శిగా రవికుమార్ (శ్రీవిద్యా నికేతన, కణేకల్లు), ఈసీ మెంబర్స్‌గా మీనా కుమారి ఎంపిక చేశారు. రాయదుర్గం అసెంబ్లీశాఖ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా రాజగోపాల్, జాయింట్ సెక్రటరీగా అన్వర్‌బాషా, గౌరవ సలహాదారులుగా అయూబ్‌ఖాన్‌లను ఎంపిక చేశారు.

మదర్ థెరిస్సా ఆశయాలను కొనసాగిద్దాం

కళ్యాణదుర్గం రూరల్: మదర్ థెరిస్సా ఆశయాలను కొనసాగిద్దామని ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని స్థానిక ఇన్ఫినిటీ ట్రస్ట్ కార్యాలయంలో కమిటీ సభ్యులతో కలసి ఆయన మదర్‌థెరీసా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కనుల పండువగా కలశ స్థాపన


అమ్మవారి కలశాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

కుందుర్పి: మండల కేంద్రంలో సోమవారం గ్రామ దేవత దుర్గాదేవి కలశస్థాపన ఉత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. అమ్మవారి కలశంతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు బోనాలతో తప్పెట్లు మేళతాళాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. మంగళవారం అమ్మవారి ఉత్సవం, రాత్రికి గ్రామోత్సవం, కుంకుమార్చన, బుధవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ట తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కుందుర్పి, నిజవళ్లి, వెంకటంపల్లి తదితర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

నేమకల్లు అంజన్నకు ప్రత్యేక పూజలు


మోసంబి అలంకరణలో ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్: నేమకల్లు ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రావణమాసం బ్రహోత్సవాల సందర్భంగా సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని మోసంబి పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి ప్రధాన అర్చకులు అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో స్వామి వారికి పవిత్ర గంగా జలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక బంగారు కిరీటధారణ, పుష్పాలకరణ, మంటప ఆరాధన, మంత్రపుష్పము, ధ్వజారోహణము తదితర పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.



ప్రత్యేక చట్టాలు తేవాలి

కోల్‌కత్తాలో వైద్యురాలిపై జరిగిన సంఘటన బాధాకరం. ఇలాంటి ఘటనలు దేశంలో మరెక్కడా జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి. ఎంతో బాధ్యతయుతంగా రోగులకు వైద్య సేవలందించే వైద్యులకు రక్షణ లేకపోవడం దురదృష్టకరం. కోల్‌కత్తాలో జరిగిన ఘటనలో బాధ్యులైన వారిపై ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తులో ఇలాంటివి చేయాలంటేనే భయం పుట్టేలా నిందితులను శిక్షించాలి.

– డాక్టర్ శ్వేత, మెడికల్ ఆఫీసర్, సీహెచ్‌సీ, కళ్యాణదుర్గం





సేవలందించే వారిపై దాడులా?

సేవలందించే వైద్యులు, వైద్య సిబ్బంది దాడులు జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. కోల్‌కత్తాలో వైద్యురాలిపై హత్యాచారం సభ్య సమాజానికి మాయనిమచ్చ. రాష్ట్రంలోని అన్ని ఆస్పత్రుల్లోనూ వైద్యులు, సిబ్బందికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. రోజుల తరబడి కుటుంబ సభ్యులకు దూరంగా ఉండి రాత్రింబవుళ్లు విధులు నిర్వహించి రోగుల సేవలో ఉండే వైద్య సిబ్బంది భద్రతపై ఆలోచించి కఠిన చట్టాలు అమలు చేయాలి.

– ఎం.కృష్ణమ్మ, హెడ్ నర్స్, రాయదుర్గం ఏరియా ఆస్పత్రి

కన్నయ్యా... మమ్మేల రావయ్యా !


కుందుర్పిమండలం మహంతపురంలో శ్రీకృష్ణ సత్యభామ విగ్రహాలు


కణేకల్లు: శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

కృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని వైష్ణవాలయాలు సోమవారం ఉదయం నుంచే భక్తులతో కళకళలాడాయి. శ్రీకృష్ణ భగవానుడి చిత్రపటాలు, విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో ఆయా ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. కన్నయ్యా... మమ్మేల రావయ్యా అంటూ భక్తులు కీర్తించారు. ఆలయ కమిటీలు, యాదవుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు అలరించారు. సామూహిక గీతాపారాయణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తరలివచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

– సాక్షిబృందం


రాయదుర్గం: కృష్ణాశ్రమంలో అలంకరణలో శ్రీకృష్ణుడు


కళ్యాణదుర్గం కోటవీధిలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న డీఎస్పీ రవిబాబు


కంబదూరు మండలం కదిరిదేవరపల్లిలో వేడుకలు నిర్వహిస్తున్న యాదవులు


బొమ్మనహాళ్ మండలం బండూరులో శ్రీకృష్ణుడి చిత్రపటం వద్ద పూజలు నిర్వహించిన దృశ్యం


ఉరవకొండ: సామూహిక గీతాపారాయణం చేస్తున్న భక్తులు


ఉరవకొండ: విశేష అలంకరణలో శ్రీకృష్ణుడి విగ్రహం


బ్రహ్మసముద్రం మండలం ముప్పలకుంటలో పూజలందుకుంటున్న శ్రీకృష్ణుడు


కళ్యాణదుర్గం మండలం దొడగట్ట గ్రామంలో ముస్తాబైన కృష్ణుడు


బెళుగుప్ప మండలం అంకంపల్లిలో శ్రీకృష్ణ దేవాలయంలో పూజలు


కళ్యాణదుర్గం మండలం ఒంటిమిద్ది గ్రామంలో అలంకరణలో కృష్ణుడు

ఆగని ఇసుక దందా


సీజ్ చేసిన ట్రాక్టర్లు

- నాలుగు ట్రాక్టర్లు సీజ్

రాయదుర్గం: అధికారులు ఓ పక్క, పోలీసులు మరో పక్క హెచ్చరిస్తున్నా ఇసుకా సూరులు మాత్రం బరితెగిస్తున్నారు. రెండు రోజుల క్రితం జుంజురంపల్లి ఇసుక రీచ్‌ను జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ నారాయణశర్మ, కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణిసుష్మిత తనిఖీ చేశారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. అయినా అక్రమార్కులు లెక్కచేయడం లేదు. సోమవారం భూపసముద్రం దారిలో ఎలాంటి పర్మిట్లు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తూ నాలుగు ట్రాక్టర్లు పోలీసులకు పట్టుబడ్డాయి. సీఐ వాటిని సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ రఘు ఒక్కో ట్రాక్టర్‌కు రూ.10 వేలు చొప్పున 4 ట్రాక్టర్లకు రూ.40 వేలు అపరాధ రుసుం విధించి విడుదల చేశారు. మరోసారి ఈ ట్రాక్టర్లు పట్టుబడితే మైనింగ్ అధికారులకు అప్పగిస్తామన్నారు.

గిట్టుబాటు ధర లభించేలా చూడండి


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్

కూడేరు: దేశంలో ఏ ప్రాంతంలో లేని విధంగా అనంతపురం జిల్లాలో ఎక్కువ రకాల పండ్లను పండిస్తారు. కూరగాయల దిగుబడి అధికంగా ఉంటుంది. కార్గో విమానాల ద్వారా వాటిని ఢిల్లీ మార్కెట్‌కు తరలించి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చూడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్‌తో కలిసి మండలంలోని పలు ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములను పరిశీలించారు. అనంతరం కూడేరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో పండిన పండ్లు, కూరగాయలను నిల్వ ఉంచుకునేందుకు కోల్డ్ స్టోరేజ్‌లు లేక సుదూర ప్రాంతాల్లోని మార్కెట్‌కు తరలించలేక పోవడంతో గిట్టుబాటు ధర లభించక రైతులు నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ మిగులు ప్రభుత్వ భూమి అధికంగా ఉందని పేర్కొన్నారు. జిల్లా కేంద్రానికి మండలం దగ్గరగా ఉంటుందని తెలిపారు. ఇక్కడ విమానాశ్రయం ఏర్పాటు చేస్తే ప్రత్యేకించి భూమి కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండదని తెలిపారు. ఈ విషయంపై ఇప్పటికే పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, పార్థసారథని కలిసి వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణ స్వామి , మల్లికార్జున, రాజా రెడ్డి, సంజీవప్ప, రైతు సంఘం నేతలు రమణ, పెరుగు సంగప్ప, తాలుకా సహాయ కార్యదర్శి మల్లికార్జున, మండల కార్యదర్శి నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలు ఏర్పాటు చేయండి

కుందుర్పి: మండల కేంద్రంతో పాటు వెంకటంపల్లి, మహంతపురం, కెంచంపల్లి, వడ్డెపాళ్యం, శ్రీమజ్జనపల్లి తదితర గ్రామాల్లో శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల సర్పంచులు మారుతేశ్వరి, గోవిందమ్మ, గంగాధర, ప్రభాకర్ కోరారు. వారు మాట్లాడుతూ గత సోమవారం కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణి సుస్మితకు వినతి పత్రం అందజేశామన్నారు. ఆయా గ్రామాల్లో శ్మశాన స్థలాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో శ్మశాన స్థలాలను కేటాయించాలన్నారు.

యాపిల్ పండ్ల అలంకరణలో జంబుకేశ్వరుడు



రాయదుర్గంటౌన్: శ్రావణ సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కోటలో వెలసిన జంబుకేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాపిల్ పండ్లతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించడంతో భక్తులు పెద్ద ఎత్తున దర్శనం చేసుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక


బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

ఉరవకొండ: అనంతపురంలోని వివేకానంద కేంద్రంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో ఉరవకొండకు చెందిన విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఉరవకొండ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదివే భరణి ట్రెడిషనల్ జూనియర్ బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే చిన్న ముస్టూరు మోడల్ స్కూల్‌లో చదివుతున్న హర్షవర్దన్, యువరాజు, జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాల విద్యార్థి మణికంఠ, విఘ్నేశ్వర, వివేకానంద స్కూల్‌లో చదివే హేమసాత్విక్, ఆర్టిస్ట్ యోగా గ్రూప్ ఈవెంట్లో ప్రథమ స్థానంలో నిలిచారు. గెలుపొందిన విద్యార్థులందరూ ఉరవకొండ నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఉచిత విద్యా, వికాస శిక్షణ కేంద్రాల్లో యోగా శిక్షణ తీసుకుంటున్నారు. గెలుపొందిన విద్యార్థులు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారని నిస్వార్థ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, యోగా గురువు వెంకట్ తాడికొండ తెలిపారు.

80 శాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలు

కణేకల్లు: ప్రత్యామ్నాయ పంట విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలని కణేకల్లు వ్యవసాయశాఖ అధికారి ఎ.శ్రవణ్‌కుమార్ రైతులకు విజ్ఞప్తి చేశారు. ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగు చేయని రైతులకు ప్రత్యామ్నాయ పంట సాగు కోసం ఉలవలు, పెసర, అలసంద, కంది విత్తనాలను 80 శాతం సబ్సిడీతో ఇస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉలవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎకరా లోపు వారికి 10 కేజీలు, ఎకరా నుంచి రెండెకరాలున్న వారికి 20 కేజీలు, రెండు నుంచి మూడెకరాలున్న వారికి 30 కేజీలు, మూడు నుంచి నాలుగు ఎకరాలున్న వారికి 40 కేజీలు, నాలుగు నుంచి ఐదెకరాలున్న వారికి 50 కేజీలిస్తున్నట్లు పేర్కొన్నారు. కేజీ ధర రూ.87 కాగా 80 శాతం సబ్సిడీపోను రైతు రూ.17.40 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒక్కో ప్యాకెట్‌లో 10 కేజీల విత్తనాలుంటాయన్నారు. ఆసక్తి ఉన్న రైతులు రైతుసేవా కేంద్రాలకెళ్లి పాస్ పుస్తకం, ఆధార్‌కార్డులు సమర్పించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ఆన్‌లైన్‌లో వేలిముద్రలు కూడా వేయాలన్నారు. బుకింగ్ చేసుకొన్న రైతులు నాలుగు రోజుల్లో విత్తనాలను సరఫరా చేస్తామని చెప్పారు.

ఘనంగా శ్రావణ మాస పూజలు


శివలింగానికి ప్రత్యేక అలంకరణ చేసిన దృశ్యం


ప్రత్యేక అలంకరణలో కుందుర్పి మల్లేశ్వరస్వామి

కళ్యాణదుర్గం: శ్రావణమాసం సందర్భంగా సోమవారం పట్టణంలోని స్థానిక మేడావీధిలో వెలసిన ఈరన్న స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఉదయం స్వామిని ప్రత్యేక పూలతో అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు శివలింగాన్ని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు.

కుందుర్పి: శ్రావణమాసం సందర్భంగా మండల వ్యాప్తంగా శివాలయాలు సోమవారం శివనామ స్మరణంతో మార్మోగాయి. రుద్రంపల్లి మల్లీశ్వరస్వామి ఆలయం, కుందుర్పి మండ్లీ మల్లీశ్వరస్వామి ఆలయం,తూముకుంట హరిహరేశ్వరస్వామి ఆలయం,కుందుర్పి వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు,అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

జోడు లింగాలకు పూజలు

కూడేరు: శ్రావణ మాసం నాలుగో సోమవారం సందర్భంగా కూడేరులోని శివ పార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి దర్శనానికి జిల్లా నలమూలల నుంచి భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు జోడు లింగాలకు క్షీరాభిషేకం, రుద్రాభిషేకం తదితర పూజలు చేపట్టారు. వివిధ రకాల పుష్పాలతో జోడు లింగాలను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు జోడులింగాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పోనుగంటి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

రిమాండ్‌కు కామాంధుడు

కణేకల్లు: కన్న కూతురిపై లైంగిక దాడి చేసిన కామాంధుడు ఎట్టకేలకు కటకటలాపాలయ్యాడు. రాయదుర్గం నియోజకవర్గంలోని ఓ గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని బాలిక ఓ స్వచ్ఛంద సంస్థలోని మానసిక వికలాంగుల కేంద్రంలో ఉంటూ చికిత్స చేయించుకుంటోంది. ఆ బాలిక పింఛన్ తీసుకునేందుకు ఆగస్టు 1న ఇంటికొచ్చింది. రెండ్రోజుల పాటు ఇంట్లోనే ఉంది. ఈ క్రమంలో తాగుడుకు బానిసైన తండ్రి కామంతో కళ్లు మూసుకుపోయి కూతురిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. గతంలోనూ ఎన్నోసార్లు బాలిక తండ్రి వికృత చేష్టలు చేశాడు. భర్త ప్రవర్తనతో విగిపోయిన భార్య .. తన కూతురుతో సహా శనివారం అనంతపురంలోని దిశ పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. అనంతపురం అర్బన్ డీఎస్పీ ప్రతాప్‌కుమార్ సదరు గ్రామానికి చేరుకొని నిందితుడి అరెస్ట్ చేసి అనంతపురం కోర్టుకు హాజరు పర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు.